## క్లుప్తంగా

### కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్లు సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారి పేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

### అల్లూరి పోలేరమ్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అల్లూరి పోలేరమ్మ

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పుట్టకు, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.


### అంకాళమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అంకాళమ్మ

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో గ్రామ ప్రజల ఇలవేల్పు అయిన అంకాళమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. చెన్నారెడ్డిపల్లి, సూరేపల్లి, సీతా నాగులవరం, మీర్జపేట, కారుమానిపల్లి, తర్లుపాడుకు చెందిన పలువురు భక్తులు మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

### విశ్రాంత హెచ్ఎం మృతి



సరళ సుశీల(ఫైల్)

మార్కాపురం టౌన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు సరళ సుశీల(72) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె భర్త జయరావు పట్టణ తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చి సెక్రటరీగా పనిచేస్తున్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలి మృతికి పలువురు సంతాపం తెలిపారు.

### 12న సామూహిక సత్యానారాయణ వ్రతం

కొత్తపట్నం: మండలంలోని కొత్తపట్నం గ్రామంలో వేంచేసియున్న ఆదికేశవస్వామి దేవస్థానంలో ఈ నెల 12న సామూహిక సత్యానారాయణ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు కూరపాటి సుబ్బారావు తెలిపారు. ఈ వ్రతంలో పాల్గొనే భక్తులకు సూరాకనవల్లి అమ్మ ట్రస్ట్ యజమానులు, వైవీ కోటయ్య చారిటీస్, గ్రామస్తుల సహకారంలో ఉచిత భోజన వసతి, పూజా సామగ్రి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వ్రతానికి మండలంలో ఉన్న భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాల్సిందిగా కోరారు.



# రండి బాబూ రండి..
# మీ వీధిలోనే.. మీ ఇంటి వద్దే!

- పుట్టగొడుగుల్లా వెలిసిన బెల్ట్ షాపులు
- గ్రామానికో దుకాణం.. విచ్చలవిడిగా మద్యం విక్రయం
- ఏకంగా ఆటోల్లో తెచ్చి మద్యం విక్రయిస్తున్నా చర్యలు శూన్యం

కొనకనమిట్ల:

మద్యం మహమ్మారి పల్లెల్లో జడలు విప్పుతోంది. గత వైఎస్సార్ సీపీ పాలనలో మండల కేంద్రాలకు పరిమితమైన ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించిన కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ప్రైవేట్ వ్యక్తులకు మద్యం లైసెన్సులు అప్పగించినట్లు ప్రభుత్వం పైకి చెబుతున్నా.. 90 శాతం దుకాణాలు టీడీపీ నాయకులకే దక్కాయన్నది అందరికీ తెలిసిన సత్యం. ఇక్కడ నుంచే అసలు కథ మొదలైంది. మద్యం దుకాణం ఎక్కడైనా నిర్వహించుకోవచ్చు అనేది కూటమి ప్రభుత్వ మద్యం పాలసీలో ఓ భాగం. అయితే ఈ మద్యం దుకాణాలకు అనుసంధానంగా గ్రామానికో బెల్ట్ షాపు పుట్టుకొచ్చింది. కొన్ని గ్రామాల్లో కూటమి సానుభూతి పరుల మధ్య పోటీ పెరిగి అదనంగా కూడా దుకాణాలు ఏర్పాటు చేశారు.

**అన్ని విధాలా సహకారం**

ఒకే వ్యక్తికి ఒక పర్యాయం అధికంగా మద్యం విక్రయించడం, ఎవరైనా అధిక మొత్తంలో మద్యం తరలించడం చట్టరీత్యా నేరం. అయితే మద్యం లైసెన్స్‌దారులు సంపూర్ణ సహకారం అందిస్తుండటంతో గ్రామాల్లో బెల్ట్ షాపులు జోరుగా సాగుతున్నాయి. గ్రామాల్లో అనధికార మద్యం విక్రయాలకు వేలం నిర్వహించే సంస్కృతి మళ్లీ మొదలైంది. విక్రయ హక్కులు దక్కించుకున్నవారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు గ్రామరాశికి చెల్లించి దర్జాగా మద్యం దందా సాగిస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులు ఒక్కో క్వార్టర్‌పై రూ.40 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

కొనకనమిట్ల మండలంలో ప్రభుత్వం మూడు మద్యం షాపులకు అనుమతి ఇచ్చింది. కొనకనమిట్ల, గొట్లగట్టు, పెదారికట్ల గ్రామాల్లో షాపులు దక్కించుకున్న వ్యక్తులు సిండికేట్ అయి మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ఈ మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపుల వేలం రూ.10 లక్షలు పలికిందంటే ఏ స్థాయిలో మద్యం దందా సాగుతోందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.

**ఆటోల్లో మద్యం దందా..**

లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలు కొనసాగుతున్న కొనకనమిట్ల, గొట్లగట్టు, పెదారికట్ల గ్రామాల్లోని బస్టాండ్ సెంటర్లలో బెల్ట్ షాపులు నడుస్తున్నా పోలీస్ యంత్రాంగం చోద్యం చూస్తుండటం విమర్శలకు తావిస్తోంది. బంకులు, షాపుల్లోనే కాదు నేరుగా ఆటోల్లో తెచ్చి మద్యం విక్రయిస్తుండటం అధికారుల తీరును వేలెత్తి చూపుతోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం షాపులో ఒక వ్యక్తికి నిర్దేశించిన పరిమాణంలో మద్యం విక్రయించాలి. కానీ అడిగినన్ని మద్యం బాటిళ్లను దుకాణదారులు ఇస్తుండటం గమనార్హం. ఇటీవల పలు చోట్ల ఆటోల్లోనూ, బంకుల్లోనూ మద్యం అమ్మకాలు చేస్తున్న పలువురిని అధికారులు అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినప్పటికీ దందా మాత్రం ఆగలేదు. బెల్ట్ షాపులు నడిపే వ్యక్తులు సంబంధిత అధికారులకు నెలవారీ మామూళ్లు ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల మునగపాడు, గొట్లగట్టు, సలనూతల, ఎదుర్లాళ్లపాడు, వద్దిమడుగు గ్రామాలకు చెందిన కొంతమంది బెల్ట్ షాపుల నిర్వాహకులపై పోలీసులు కేసులు నమోదు చేసి వదిలేశారు. అయితే సదరు వ్యక్తులు స్థానిక కూటమి నాయకుల అండ చూసుకుని మద్యం అక్రమ వ్యాపారం పునః ప్రారంభించారు. కూటమి నాయకుల ఒత్తిడితో బెల్ట్ షాపులపై దాడులకు ఎక్సైజ్ అధికారులతో పాటు పోలీసులు కూడా వెనుకాడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఆటోలో మద్యం విక్రయాలు(ఫైల్)

## అనుములపల్లెలో సంప్రదాయ పోటీలకు ఆహ్వానం

- జీవనమూర్తి స్వామి జెండా మహోత్సవం సందర్భంగా..
- ఈ నెల 17న కులుకు భజన, గురు కోలాటం, గుండు ఎత్తే పందేల నిర్వహణ
- విజేతలకు రూ.2.50 లక్షల విలువైన నగదు బహుమతులు

రాచర్ల: మండలంలోని అనుములపల్లె గ్రామంలో జీవనమూర్తి స్వామి జెండా మహోత్సవం సందర్భంగా ఈ నెల 17వ తేదీన సంప్రదాయ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు దేవస్థానం కమిటీ సభ్యులు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పోటీల నిర్వహణ, బహుమతుల వివరాలు వెల్లడించారు. ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు కులుకు భజన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు రూ.500 రూపాయలు డిపాజిట్ చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కులుకు భజన పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30, నాలుగో బహుమతి రూ.20 వేలను అందజేస్తామని పేర్కొన్నారు. అలాగే 17వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు గురు కోలాటము నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు రూ.500 చెల్లించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. గురు కోలాటం పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు అందజేస్తామని తెలిపారు. 17వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు గుండు ఎత్తే పందేలు నిర్వహిస్తున్నామని, పాల్గొనేవారు రూ.200 డిపాజిట్ చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతకు రూ.10 వేలు నగదు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు.

## అశ్వ వాహనంపై శ్రీవారు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని జంకె రామిరెడ్డి నగర్‌లో కొలువై ఉన్న లక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం స్వామివారు అశ్వవాహనంపై ఉభయ దేవేరులతో కలిసి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి అర్చకులు విశ్వక్సేన పూజ, మహాశాంతి హోమం, చక్రస్నానం నిర్వహించారు. ఉభయ దాతలుగా నాదెళ్ల సుబ్రమణ్యం దంపతులు, చంద్రమౌళి దంపతులు వ్యవహరించారు. స్వామివారికి పట్టువస్త్రాలు, పూలు సమర్పించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు చక్కా మాలకొండ నరసింహారావు, ఉటుకూరి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేజే నరసింహం తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అశ్వ వాహనంపై స్వామివారు

## పోరాటాల నేత పుల్లయ్య



పుల్లయ్యకు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మార్కాపురం: మార్కాపురం ప్రాంతంలో పలకల కార్మికులు, వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం పోరాడిన కమ్యూనిస్టు ఉద్యమ నేత పుల్లయ్య సేవలు మరువలేనివని సీపీఎం నాయకులు కొనియాడారు. ఆదివారం సీపీఎం సీనియర్ నేత ఏనుగుల పుల్లయ్య 16వ వర్ధంతి సందర్భంగా కోర్టు సెంటరులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుల్లయ్య ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.సోమయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి రఫీ, మండల కార్యదర్శి బాలనాగయ్య, రూబెన్, రాజు, సురేష్ కుమార్, నన్నేసా, యూటీఎఫ్ నాయకుడు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 2 డీప్ బోర్లు ప్రారంభం

మార్కాపురం: గొట్టిపడియ గ్రామంలో ఎస్సీ కాలనీలో నీటి సమస్య తీర్చేందుకు 4 లక్షల రూపాయలతో రెండు డీప్ బోర్లను ఏర్పాటు చేశామని ఎంపీటీసీ సభ్యురాలు కొత్రపోలు సంధ్యారాణి తెలిపారు. మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన రెండు డీప్ బోర్లను ఆదివారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తుమ్మా వెంకటరెడ్డి, కాశిరెడ్డి, అనుబోలు సుబ్బారెడ్డి, రంగారెడ్డి, కె.దేవసహాయం పాల్గొన్నారు.

బోరును ప్రారంభిస్తున్న సంధ్యారాణి, పక్కన వెంకటరెడ్డి

## ఒక్క మాత్రతో నులిమేద్దాం

- నేడు జాతీయ నులిపురుగుల దినోత్సవం
- 2 నుంచి 19 ఏళ్లలోపు వారికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

బేస్తవారిపేట: చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపించే అనారోగ్య సమస్యల్లో నులిపురుగులు ప్రధానమైనవి. ఈ పురుగులు కడుపులోకి చేరడంతో పిల్లల్లో నీరసం, బేలతనం, ఆహారం సరిగా తీసుకోకపోడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. క్రమేణా రక్తహీనతకు దారితీస్తుంది. మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారుతుంది. చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ఈ నులిపురుగులను ఒకే ఒక మాత్ర ఆల్బెండజోల్‌తో నివారించవచ్చు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు వైద్యశాఖ ఏడాదికి రెండు సార్లు జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. పిల్లలకు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తుంది. ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్న 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు వైద్య సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు ఆల్బెండజోల్ 200 ఎంజీ సగం మాత్ర నీటిలో కలిపి తాపాలి. 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు 400 ఎంజీ మాత్రను మధ్యాహ్నం భోజనం తర్వాత ఇవ్వాలి. ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ఏ కారణంతోనైనా 10వ తేదీన మాత్రలు తీసుకోని వారు ఉంటే ఈనెల 17వ తేదీన మరో మారు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మాత్రలు అందజేయనున్నారు.

**వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానం**

పిల్లల్లో నులిపురుగులు సంక్రమించడానికి ప్రధాన కారణం అపరిశుభ్రత, మట్టిలో ఆడుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం ద్వారా నులి పురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. పిల్లల చేతిగోర్లను శుభ్రంగా ఉంచేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూడాలి. భోజనం చేసేటప్పుడు, మూత్ర, మల విసర్జన అనంతరం చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా నులిపురుగుల బారి నుంచి రక్షణ పొందవచ్చు. దీనిపై పిల్లల్లో అవగాహన పెంచాలి. పండ్లను తినే ముందు నీటితో శుభ్రంగా కడగాలి. ఆహార పదార్థాలపై ఎప్పుడూ మూత ఉంచాలి.



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారులు



కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

## శిథిల భవనంలోనే మగ్గండి.. కొత్తది వద్దులెండి!

- ఇడుపూరులో ప్రారంభానికి నోచుకోని సచివాలయ సముదాయం
- విద్యుత్, ప్లంబింగ్ పనులు చేయించకుండా పాలకుల నిర్లక్ష్యం

మార్కాపురం: మండలంలోని దరిమడుగు, ఇడుపూరు, రాజుపాలెం గ్రామాలకు సంబంధించి సుమారు 5 వేల మంది ప్రజలకు సేవలందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇడుపూరు వద్ద గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ నిర్మాణాన్ని చేపట్టారు. దాదాపు 80 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయి. ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిన పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సచివాలయ నిర్మాణం పూర్తి చేయడంపై నిర్లక్ష్యం వహించారు. కాగా దరిమడుగులోని ఒక భవనంలో ఏర్పాటు చేసిన సచివాలయ భవనంలో శ్లాబు పెచ్చులు ఊడి పడుతుండటంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. రూ. 40 లక్షలతో నిర్మిస్తున్న సచివాలయం, రూ.21.8 లక్షలతో నిర్మిస్తున్న హెల్త్ క్లినిక్‌లో విద్యుత్ వైరింగ్, ప్లంబింగ్ మాత్రమే చేపట్టాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 8 నెలలు గడిచినా పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. నూతన భవనాలను అందుబాటులోకి తెస్తే ఉపయోగకరంగా ఉంటుందని అటు గ్రామస్తులు, ఇటు ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయం